# 23

# పరదేశులు మరియు యాత్రికులు

## (11:8-22)

ఈ పాఠం యొక్క పేరు హెబ్రీయులకు 11:13లో కనబడుతుంది. ఇంతకు ముందు "నిరుత్సాహానికి దేవుని పరిష్కారం" అనే పాఠమును చూశాము. అలాగే వాక్య భాగమును బట్టి "ప్రాపంచిక మరియు లౌకిక వాదమునకు దేవుని పరిష్కారము" అన్న పేరును కూడ ఈ వాక్య భాగమునకు పెట్టవచ్చు. ఈ పాఠం అబ్రాహాము మీద కేంద్రీకరించబడింది (యెషయా 41:8; ఆదికాండము 15:6; గలతీయులకు 3:29).

### అవసరమైనది: ఒక క్రొత్త కోణం

అబ్రాహాము వలె మనము కూడ ఈ లోకములో "యాత్రికులము, పరదేశులమైయున్నాము." పాఠములోని ప్రతి విభాగంలోనూ మనం మొదటిగా అబ్రాహామును గురించి చూడబోతున్నాము (ఇస్సాకు, యాకోబులతోపాటుగా). తర్వాత వ్యక్తిగత అన్వయింపులో పత్రిక యొక్క మొదటి పాఠకులను దృష్టిలో ఉంచుకుంటున్నాము.

**అబ్రాహాము మరియు యితర పితరులు**

దేవుని చేత పిలువబడినప్పుడు అబ్రాహాము మెసొపొతమియ లోయలోనున్నాడు (8 వ.). "ఎక్కడికి వెళ్లవలెనో అది ఎరుగక బయలు వెళ్లెను." అతడు వెళ్లవలసిన ప్రదేశం ఎటువంటిదో చెప్పే ప్రయాణ వివరణను దేవుడు అతనికి ఇవ్వలేదు.

"అతడును, ఇస్సాకు, యాకోబు అనువారును, గుడారములలో నివసించుచు అన్యుల దేశములోనున్నారు" (9 వ.). అప్పటి సామాజిక లెక్కల ప్రకారం అన్యుల దేశంలోని నివాసి దాదాపు బానిసవంటివాడు. అబ్రాహాము, అతని కుటుంబపు వారు "పరదేశులు మరియు యాత్రికులు" (13 వ.). పరదేశులు అంటే ఇతర దేశములవారు. KJVలో పరవాసికి "యాత్రికులు" అని వాడబడింది. యాత్రికులు ఒక ప్రదేశంలోనుండరు. అన్ని స్థలాలు తిరుగుతుంటారు. శారా మరణ విషయంలో అబ్రాహాము దుఃఖిస్తూ ఆ ప్రాంతపు వారితో, "మీ మధ్య నేను పరదేశినిగాను, పరవాసినిగాను ఉన్నాను" అని చెప్తున్నాడు (ఆదికాండము 23:4).

**హెబ్రీ క్రైస్తవులు మరియు మనము**

హెబ్రీయులకు 13:12-14ను ఒకసారి చూడండి. 11:8-22లో చెప్పబడిన దానిమీద ఆధారపడి ఇది చెప్పబడింది. అబ్రాహాము వలె మనము కూడ – సువార్త వలన పిలువబడ్డాము (2 థెస్సలొనీకయులకు 2:14). మన శాశ్వత నివాస స్థలము పరలోకము. మనం ఈ లోకంలో ప్రయాణిస్తున్నాము (2 కొరింథీయులకు 5:1-8).

## అవసరమైనది: ఒక క్రొత్త ఉద్ఘాటన

ఈ లోకంలో మనం "పరదేశులము మరియు యాత్రికులమై యున్నాము," కాబట్టి మన ఉద్ఘాటన యొక్క జీవితం పైనుండకూడదు కానీ రాబోవు లోకం మీదనే యుండాలి. మరోసారి అబ్రాహామును చూసి మన వైపు చూద్దాము.

### అబ్రాహాము మరియు ఇతరులు

అబ్రాహాము, ఇతని కుటుంబీకుల దృష్టి ఇక్కడ ఇప్పటి వాటి గురించి కాదు. అబ్రాహామునకు అతని సమాధుల ప్రదేశం అయిన మక్పేలా పొలమును, దానిలోని గుహ తప్ప మరింకే ఆస్తీ లేదు (ఆదికాండము 23:17-20).

అబ్రాహాము మరియు ఇతర విశ్వాస వీరుల ప్రాధాన్యతలను గురించి అనేక వచనాలు చెప్తున్నాయి. "దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడైయున్నాడో పునాదులు గల ఆ పట్టణము కొరకు అబ్రాహాము ఎదురుచూచుచుండెను" (హెబ్రీయులకు 11:10; చూడు ప్రకటన 21:2). అతని, అతని వంశపువారు "తమ స్వదేశమును వెదుకుచున్నారు" (హెబ్రీయులకు 11:14). "తమ స్వదేశము" అను మాట (*patris*) అను పదంనుండి వచ్చింది. దీనికి "తండ్రి యొక్క ప్రదేశము"[1] అని అర్థం. వారు "మరి శ్రేష్ఠమైన దేశమును, అనగా పరలోక సంబంధమైన దేశమును" కోరుకున్నారు (16బి వ.; గమనించండి నిర్గమకాండము 3:6, 15; మత్తయి 22:32).

### హెబ్రీ క్రైస్తవులు మరియు మనము

ఆత్మీయ విషయముల ప్రాధాన్యత మరియు ముఖ్యముగా నిత్యత్వ విషయముల ప్రాధాన్యతను ఈ పత్రిక అసలు పాఠకులు గుర్తించవలసి ఉంది. మనమూ దాన్నే గుర్తించాలి. మన ఎదుట ప్రాముఖ్యమైనవిగా కనిపిస్తున్నవి కేవలం తాత్కాలికమైనవి. మన దృష్టి రాబోవు లోకం మీదనేయుండాలి. మనకు "పరలోక సంబంధమైన పిలుపు" ఉంది (హెబ్రీయులకు 3:1) మన పౌరసత్వం పరలోకమందే ఉన్నది (ఫిలిప్పీయులకు 3:20). అక్కడే మన ప్రభువు ఉన్నాడు (యోహాను 14:2, 3), మన నిరీక్షణ (చూడు హెబ్రీయులకు 6:19, 20), మన ధననిధి (మత్తయి 6:20) అక్కడే ఉన్నాయి, అక్కడే మన పేర్లు వ్రాయబడియున్నాయి (లూకా 10:20). మనలను ఆయనతో కూడ నుండడానికి యేసు అక్కడికే తీసుకు వెళతానని వాగ్దానం చేశాడు (యోహాను 14:3).

మన నిజమైన నివాసముగా, మన శాశ్వత నివాసముగా ఈ లోకమును గాక పరలోకాన్ని మనం ఊహించినట్లయితే, మన జీవితంలో ఎంతటి మార్పు వస్తుంది! మన సమయాన్ని ఎలా గడుపుతున్నామో, మన ధనాన్ని ఎలా వెచ్చిస్తున్నాము, మన తలాంతులను ఎలా వాడుతున్నాము అన్ని విషయాలు ఈ ఆలోచనతో మారిపోతాయి. మన దురదృష్టాన్ని చూసే విధానం మారిపోతుంది. మన జీవితంలోని *ప్రతిదానిపై* దీని ప్రభావం ఉంటుంది.

## అవసరమైనది: నిజమైన విశ్వాసం

అటువంటి దృక్పథం కలిగియుండుటకు నిత్యమైన వాటిని దృష్టించుటకు మనకు సహాయపడేది ఏది? దీనికి సమాధానం *విశ్వాసం.*

**అబ్రాహాము మరియు తోటివారు**

అబ్రాహాము సరియైన దృక్పథం కలిగియుండడానికి కారణం అతని విశ్వాసం అని 8 మరియు 9 వచనాలు చెప్తున్నాయి. "అబ్రాహాము పిలువబడినప్పుడు *విశ్వాసమును* బట్టి ఆ పిలుపునకు లోబడి ..." (8ఎ వ.; నొక్కి చెప్పింది నాది). "పిలువబడడం" అనేది వర్తమాన కాలంలోనున్నది. అంటే, పిలుపునకు వెంటనే లోబడ్డాడు అని సూచిస్తుంది. "ఎక్కడికి వెళ్ళవలెనో ఎరుగక బయలువెళ్లెను" (8బి వ.) – మరోవిధంగా చెప్పాలంటే, "*విశ్వాసమును* బట్టే [అబ్రాహాము] తన ఇంటిని విడిచిపెట్టాడు" కనాను మరియు ఇతర ప్రాంతములో దాదాపు వందేళ్ళపాటు విశ్వాసమును బట్టి అబ్రాహాము అన్యులదేశములో నివసించాడు (9 వ.; నొక్కి చెప్పింది నాది).

అబ్రాహాము విశ్వాసాన్ని అతని కుటుంబం కూడ పంచుకుంది. "విశ్వాసమును బట్టి శారాయు వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడని యెంచుకొనెను గనుక ... గర్భము ధరించుటకు శక్తిపొందెను" (11ఎ వ.). ఇక్కడ శారా యొక్క శక్తి మీద నొక్కి చెప్పబడలేదు గాని ఆమె విశ్వాసమునకు కారణమయిన దేవుని నమ్మకత్వము గూర్చి చెప్పబడింది. "విశ్వాసమును బట్టి అబ్రాహాము ఇస్సాకును బలిగా అర్పించెను" (17ఎ వ.; చూడు 18, 19 వచనాలు). "విశ్వాసమునుబట్టి ఇస్సాకు యాకోబు, ఏశావులను ఆశీర్వదించెను" (20ఎ వ.). "విశ్వాసమునుబట్టి యాకోబు ... ఆశీర్వదించి, దేవునికి నమస్కారము చేసెను" (21 వ.). "యోసేపు ... విశ్వాసమును బట్టి ఇశ్రాయేలు కుమారుల నిర్గమనమును గూర్చి ప్రశంసించెను" (22ఎ వ.).

దీని ఫలితంగా వీరందరూ "విశ్వాసముగలవారై మృతిపొందిరి" (13 వ.). ఇదే హెబ్రీ గ్రంథకర్త తన పాఠకుల విషయంలో కోరుకునేది. అలాగే దేవుడు మననుండి ఆశించేది (చూడు ప్రకటన 14:13)!

**హెబ్రీ పత్రిక చదువరులు మరియు మనము**

మన అవసరతలలో గొప్ప అవసరత, విశ్వాసమును గురించినది (హెబ్రీయులకు 11:6; రోమీయులకు 10:17). అబ్రాహాము వలె – దేవుని మాటను అనుసరించేంత విశ్వాసం కావాలి. దేవుని మాటను బట్టి వెంటనే కార్యము చేయగలిగే – విశ్వాసం కావాలి (యాకోబు 2:14–26).

ఒక్కోసారి ఈ లోకములోని సమస్యలు మనల్ను చుట్టు ముడుతుంటాయి. అప్పుడు మనం ఏం చేయాలి? విశ్వాసం ద్వారా మనం వాటిని అధిగమించగలం. విశ్వాసం ద్వారా జీవించి, విశ్వాసం కలిగి మృతిచెందడానికి దేవుడు మనకు సహాయం చేయును గాక!

---

సూచన

[1]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 133.